COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 24 జూన్, 2023.

**పోలవరం పోరుకేక: 2013 చట్టం ప్రకారం పునరవాసం, పరిహారం చెల్లించాల్సిందే**

**పోలవరం పోరుకేక మహాపాదయాత్రకు అపూర్వ స్పందన**

**విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు**

**సంఘీభావం తెలిపిన పి.మధు, మిడియం బాబూరావు, బండారు రవికుమార్,**

**ఒరిస్సా రాష్ట్రం మల్కన్ గిరి జిల్లా కార్యదర్శి పాణిగ్రాహి**

పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం, పరిహారం చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం నిర్వాసితుల పోరుకేకకు విలీన మండలాలలో అపూర్వ స్పందన లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తెలిపారు. పోరుకేక ఐదో రోజు మహా పాదయాత్ర చింతూరులో శనివారం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా చింతూరు సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గడచిన నాలుగు రోజులుగా 40 గ్రామాలు పర్యటించామని, పార్టీలకు అతీతంగా నిర్వాసితులు గ్రామ గ్రామాన ఘన స్వాగతం పలికి ముంపుపై తమ ఆందోళనను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పది సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిర్వాసితులను బలిచేస్తూ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.

కేంద్రం నుంచి నిధులు రాబట్టలేకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలని, కేంద్రం ఇవ్వటంలేదంటూ నిస్సహాయత వ్యక్తం చేస్తే అది అసమర్థతేనని మండిపడ్డారు. ఇటువంటి వాఖ్యలు ముఖ్యమంత్రి వ్యక్తిత్వానికే కళంకం అని అన్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు కోత పెట్టి, కమిషన్ల కక్కుర్తితో ఎస్టిమేషన్‌లు పెంచుతూ కాంట్రాక్టర్ల జేబులు నింపుతారా...? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంలోని బిజేపీకి భజన పార్టీలులా మారాయని, కేంద్రంతో పోట్లాడకుండా ఏం ఉద్ధరిస్తారని నిలదీశారు. పోలవరం నిర్వాసితుల కోసం తాము పోరాటం చేస్తున్నామని, ప్రజల కోసం పోరాడతారా...? లొంగిపోతారా...? తేల్చుకోవాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ప్రజాదరణ లేని బిజేపీ ఈ మూడు పార్టీలను అడ్డంపెట్టుకుని నాటకాలాడుతోందని మండిపడ్డారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన వారాహి పర్యటనలో కేంద్రం చేసిన మోసంపై ఎందుకు ప్రశ్నించటం లేదని అన్నారు.

శ్రీవాని ట్రస్టును అడ్డంపెట్టుకుని విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని సమరసత ఫౌండేషన్‌లకు వందల కోట్లు కేటాయించి రాష్ట్రాన్ని మత ఘర్షణల కుంపటిగా మార్చుతారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రాన్ని ఎక్కడికి తీసుకెళ్తారని మండిపడ్డారు. తక్షణమే ఆ నిధులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విశాఖపట్నం రియల్ ఎస్టేట్ మాఫియాకు కేంద్రంగా మారిందని ఎంపి ఎంవిపి కుటుంబం కిడ్నాప్‌ను ఉదాహరణగా చెప్పారు. అక్కడ జరుగుతున్న దందాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ప్రజలకు భరోసా కల్పించాలని అన్నారు. సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ ఎం.పి. పెనుమల్లి మధు మాట్లాడుతూ గత సంవత్సరం వరదల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సారైనా ముందస్తు నష్టనివారణా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ రోజు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలియజేసిన వారిలో మాజీ ఎం.పి. మిడియం బాబూరావు, ఒరిస్సా మల్కాన్ గిరి జిల్లా సిపిఐ(ఎం) కార్యదర్శి పాణిగ్రాహి, తెలంగాణ సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీ బండారు రవికుమార్‌లు ఉన్నారు.

J. Jayaram

(జె.జయరాం)

ఆఫీసు కార్యదర్శి